
# భక్తశబరి

★

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.



రచయిత :

**దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి**

కాకినాడ

# భక్తశబరి

★

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి.

హేమలంబి–శ్రావణము

ఆగస్టు ౧౯౫౭

1957

మూల్యము

రూపాయి 50 నయాపైసలు.

ప్రభాత్ ప్రెస్, కాకినాడ.

# నా మున్నుడి

మానవులు తరించుటకు జ్ఞాన మొకముఖ్యసాధనమైనట్లే భక్తి గూడ వేఱొకసాధనము. జీవు లన్నియు లోకయాత్ర సాగించి సాగించి యేనాటికో యొకనాటికి గమ్యుఁ డగు పరమేశ్వరుని జేరుటయే మోక్షము. దీని నందుటకు జాతిమతభేదములుగాని లింగభేదములుగాని లేవు. అట్టి జీవేశ్వరైక్యము సంపాదించుటకు జ్ఞానమార్గము దుర్గమమనియు, భక్తి సులభమార్గ మనియు పెద్ద లందురు.

రెండవదారిగూడ నందుటకు సుకరము కానిది. అదెంతో నిష్కలంకమై నెగడవలెను. ఆడంబరరహితముగ నడువవలెను. దీనికి పరుల మెప్పెంతమాత్రము ననపేక్ష్యము. లోకపరిచార మనవసరము. భక్తిభావము గురుదర్శితమార్గమున నిశ్చలత నందుకొనవలెను. అట్టిస్థితికి వచ్చినజీవి కీసంసారబంధము లన్నియు ముచికపట్టునుండి దోసపండువలె వానికవే విడిపోవును. అప్పుడు దేవుఁడుకూడ నట్టివానికి దొరకితీఱును. ఈతత్త్వమునే మనకు శబరి బోధించునది.

శబరి యొకబోయజాతికిఁ జెందినది. ఎట్టిసంస్కారమును నీజన్మమం దెఱుఁగనిది. కాని దానిజన్మాంతరసంస్కారము గొప్పది. అది మన కగోచరము. జన్మాంతరవాసన లేనిదే భక్తి జ్ఞానమార్గములందు జీవి యడుగు వెట్టలేఁడు. అవి వచ్చునే వచ్చును. మీదుమిక్కిలి ఆచరించువారియెడల ద్వేషముగూడ గలుగుచుండును.

ఈసిద్ధురాలగు శ్రమణిని మనకు మొట్టమొదట చూపించిన వాఁడు వాల్మీకి. దీనిసంక్షిప్త వృత్తము రామాయణాంతర్గతము. నిగూఢమైన నివురుగప్పిన నిప్పువలెనున్న తత్త్వములనుగూడ పసిపట్టి యాజీవుల నుద్ధరించుట దేవునిపని. అవతారమూర్తి శ్రీరాముఁడు తరింపఁజేయుటకై వెదకుకొనుచు నీ మెను జేరినాఁడు. శబరి గురు కటాక్షమున పరిపక్వస్థితి నందిన పూర్ణభక్తితో రాముని కాతిథ్య మిచ్చినది. ఆలీలామానుషవిగ్రహుఁ డామెకు మోక్షదాత యైనాఁడు.

వాల్మీకికృతమైన రామాయణమందలిశబరి మిక్కుటము గ గురు సేవలు నెఱపినది. తపోయోగశక్తుల రెంటిని కొంచెమో గొప్పో చేఁబట్టినది. తన్మూలముగఁ దాను దరించి పరులను దరింపఁజేసినది.

ఇందు శబరియొక్క చరమభాగకథయేగాని పూర్వచరిత్రము లేదు. అదైనను ప్రాసంగికము. దీనిపూర్ణచరిత్ర పద్మపురాణాంతర్గత ముగ నున్నది. భక్తమాల యనుగ్రంథములో నూఱుశ్లోకములలో నది యుద్ధరింపఁబడి యున్నది. ఇందు శబరి మొదటినుండి తుదివఱకు గోచరించును. దీని నాధారముగాఁ జేసికొనియు రామాయణమును జోడించుకొనియు నీఖండకృతిని నేను రచించితిని. ఈకృతికన్య కివన్నియు నామమాత్రముగ నాలంబనములు.

నామిత్రుఁడు వద్దిపర్తి చలపతిరావు. అతఁడు హిందీభాషలోఁ బండితకవి. సంస్కృతాంధ్రములయందు వ్యుత్పన్నుఁడు. తెనుఁగుకైత కమ్మకమ్మగ కట్టఁగల దిట్ట. సహృదయుఁడు. "నాపరిచితులకొకరి కొకభక్తచరిత్ర కావలసి యున్నది. నీయుపాఖ్యకృతి విన్నతరువాత

నా కీయూహ పొడమినది. దానిని నీవు వ్రాయుము" అన్న ప్రబోధ మీకృతి కుద్దీపనము. తదుపరి కృతిభర్తలు నన్నుఁ గోరియుండుటచే కృతికన్నె రూపొందినది. తోడనే కావ్యము విని శ్రీపద్మనాభముగారు నన్ను యథోచితముగ గౌరవించి దీనిని ముద్రింపించినారు. ఆధారము లేనిదే తీవ ప్రాకి యల్లుకొనుట యసంభవముగదా!

## కావ్యవిశేషములు

గురుసేవాసమయమున శబరీప్రవృత్తిని కొందఱు మునులు తప్పుగా భావించుట సంభవమా? ఈనాఁటి మనపల్లెలదృష్టితో నాఁటి మున్యాశ్రమములను, నేఁటి గ్రామీణుల దృష్టితో నాఁటి మహర్షుల నెన్నుట హాస్యాస్పదముకాదా యనునొకశంక కలదు.

తప్పక యీఁనాఁటి యగ్రహారములవంటివే యానాఁటి మునివాటికలును. ఈనాఁటి యుత్తమబ్రాహ్మణులే యానాటి మహర్షులును. రాక్షసలోకములో బలిప్రహ్లాదులును, దేవలోకములో పిశాచ, గుహ్యక, సిద్ధులవంటి క్షుద్రదేవతలును, గ్రహలోకములో శనిరాహు కేతువులు నున్నట్లే నాటిమునిపల్లెల లోను సామాన్యులేల యుండి యుండరాదు? దేవతాంశసంభూతు లగు రామకృష్ణాదులకేని యీ యపనిందలు తప్పినవా? మానవులలో హీనులు మహర్షులును లేరా? ఇంతకును మహర్షిప్రోక్త మగుమూలమున్నది. దానిని కాదనలేము.

శబరి రాముని కెంగిలిపండ్లు పెట్టినది. శబరియెంగిలిని రాముఁడు భుజించినాఁడు. ఈభావము పాటలలో పద్దెములలో జానపదగీతములలో నెల్లెడల నల్లుకొన్నది. శ్రీమద్రామాయణములో నిది మృగ్యము.

రామునికి శబరి 'ఉచ్ఛిష్టము, ను మాత్రమే సమర్పించినదని యభిజ్ఞులవాదము. ఉచ్ఛిష్ట మనఁగాఁ దినఁగా మిగిలినది. ఎంగిలి కాదు. ఎంగిలి యనఁగాఁ దననోటితో బట్టి రుచిచూచి విడిచినది. పురుషుఁడు ముందు భుజింపనిదే మనస్త్రీలు ముందుగఁ దినరు. తిన్నచో స్త్రీ యుచ్ఛిష్టము పురుషుఁడు తినినవాఁ డగును. అది మిక్కిలి హేయము. అట్టియన్నాదులు అతిథులకు పనికిరావు. ఇట్టు లుపయోగింపఁగా మిగిలిన పండ్లనే శబరి రామున కిడినది. ఏండ్లతరబడి ఫలాహారముతో పంపాసమీపకాననమున నివసించుశబరి కేచెట్టుపండు లెట్లుండునో కొఱికి చూచినఁగాని తెలియదా? ఇంత జ్ఞానవంతురా లగుశబరి దైవమని తెలిసినరామునికి కొఱుకు లిడునా? అనునది యొకటి.

ఇది సత్యమే. కొఱికిపెట్టు టాకతప్పుగాఁ దోఁపకుండుటయు, తీయనిచెట్లపండ్లైనను పరిపాకవశమున రుచిచెడి యుండవచ్చుననియు తీయనిపండ్లే యాత్మారాముఁడు రాముని కిడవలెనను వాత్సల్యమును, నిజమైన భక్తురాలికొఱుకులుగూడ నిస్సంకోచముగా రాముఁడు తినుటయు, సందేహించువారిని దిను మనుటయు, ననునవి మొదలగువిషయములు శబరిభక్తికిని, భక్తపరిపాలకునకును బరాకాష్ఠలుగదా! తిన్నఁడు పుక్కిలించిననీరు శివునికి గంగాజలమై యందాతఁ డోలనాడినాఁడు. ఆతఁ డిడిన కఱకుట్లు పిండివంటకములవలె కమ్మగ భుజించినాఁడు కాఁడా? ఇంతకును పండ్లయందలి రుచిని తనదంతములతో కొఱికి పరీక్షచేసినటులు మూలమునఁ గలదు.

శబరి యనుపేరుగల నది గోదావరితో చేతులుకలిపి ప్రవహించుట ప్రత్యక్షము. దీనికీపేరు వచ్చుటకుఁ గారణ మేమో?

ఇది శబరీనామము స్థిరత్వ మందుటే యని నాకుఁ దోచినది. ఉభయజన్మములయందును లోకకల్యాణమే లక్ష్య మని నాయూహ. మానులకును దదాశ్రమములకును, సేవ లొనర్చి మతంగా శ్రమవాసులకెల్ల దైవదర్శనము గలిగించినది శబరి. ఇఁక రామతారకోపదేశము మూలమున లేదు. మిగిలిన కొన్ని విషయాంతరములు మూలమునందలి బీజములకు విస్తృతకథనములు–కొన్ని సందర్భపరిపుష్టికి కల్పితములును.

కవిత్వము, భాష మున్నగువాని నాణ్యమునుగుఱించి సహృదయులకు విడిచితిని. 'కాచమణిసరీ, 'ఐతేనొక్కటి' మున్నగుపదములను గమనించియే వాడితిని. ఇందొకటి యంత్యప్రాసము, రెండవది యందమైన వ్యావహారికమును.

ఈదానిని ముద్రించి లోకమున కందిచ్చి నన్ను ప్రోత్సహించిన శ్రీ గడ్డం పద్మనాభంగారు సంపన్నగృహస్థులు– పీఠికలో వీరిగుణగణములను దెలియుదురుగాక. ఈసత్కార్యాచరణమువలన వీరు చిరాయురారోగ్యభాగ్యము లందుదురుగాక.—

ఓ మితి శివమ్.

—ర చ యి త.

# కృతిపతి ప్రశంస

పరమపావనైలానదీప్రాంతమందు
వీరవసులకు నిలయమ్మై; భూరిసంప
దలను దులతూఁగుగ్రామము గల దొౕకందు
వీరవర మందు రద్దాని విశ్వజనులు.

కాఁపులు సజ్జనాళి కరిగాపులు తెల్గుధరిత్రి కెప్పుడుం
గాఁప్రులు ధర్మరక్ష కరిగర్వనిషూదనధీరు లెల్లెడం
గాఁపులు నగ్రిజాతికి జగామగలై యొడిద్రిప్పి మీసలన్
గాఁపుఁదనాన మించుటను గాఁపులు కాఁపులె యైరి భూస్థలిన్.

గెడ్డము గృహనామముగా
దొడ్డలు నాఁ గాఁపజాతిదొర లొప్పుదు రీ
గడ్డను వీరవరమునం
దడ్డము నాఁకలు నెఱుంగ రనువరు లగుచున్.

ప్రథితమా కాశ్యపాల శ్రీవత్సగోత్ర
జన్ములై సాత్వికాహారసారు లగుచు
ఈసువంశస్థు లధికసమృద్ధిఁ బొదలి
సద్గృహస్థులునై చక్క సాఁగినారు.

అచ్చెయనామధేయుఁడు నిరర్గళకర్షకుఁ డాకులంబునన్
సచ్చరితుండు లోకహితసాధకుఁ డౌచు జనించె; నాతఁ డే
పొచ్చె మెఱుంగఁ డెప్డు పశుపోషణకర్షణముల్ స్వవృత్తిగా
మచ్చిక చూపి సర్వజనమాన్యుఁడు నై వెలసెన్ గుణోన్నతిన్.

అతనికి బాపనయ్య కొడు కయ్యెను, దత్సుతు లైరి నల్వు రు
న్నతగుణకీర్తిశాలురు సనాతను; లందునఁ బద్మనాభుఁ డన్
మతివరుపుత్రుఁడై సకలమాన్యుఁడు సూరయ యన్ మహాత్ముఁ డు
ప్పతిలెను; తండ్రి యాచుఁ గృతిభర్తకుఁ గాఁపుకులాగ్రగణ్యుఁడై.

అతఁడు బత్తులరామన్న యనుగుఁదనయ
యగు మహాలక్ష్మి ధర్మపత్నిగ గ్రహించి
చక్కనిగృహస్థధర్మముం జరిపినాఁడు
ధన్యుఁ డైనాఁడు సూరయ మాన్యవృత్తి.

ఈశ్వరలీల లెంతేభక్తిఁ గావ్యంబు
గా రచించినయట్టిఘనుఁ డతండు
అష్టవధానంబు నలవరించుచు మించి
కవులమన్ననఁ గన్నఘనుఁ డతండు
సంగీతశాస్త్రప్రసంగతి నొకకొంత
మనన మొనర్చినఘనుఁ డతండు
అర్యమభక్తుఁడై యాదిత్యుఁ జూడక
తినుట యెఱుంగనిఘనుఁ డతండు

పద్మనాభాదిసుతుల సంపదభిరాము
లార్వురను గన్నతండ్రి సూరయ్య గారు
అందు జ్యేష్ఠుని జెందె బిత్రంశ మెల్ల
తండ్రిగుణములు పుత్రులం దగులకున్నె ?

ఆంధ్రాంగ్లభాషల నలవరించినవాఁడు
విజ్ఞానఘనుఁ డౌచు వెలయువాఁడు
వరరామభక్తితత్పరతానుభావుఁడు
పరమపరిశాంతుఁడై వరలువాఁడు
తెలుఁగుఁగైతల తేటతెల్లమ్మెఱుఁగువాఁడు
మితభాషితమ్ముల మెలఁగువాఁడు
సత్పుత్రపుత్రికా సంతానము గలాఁడు
కవిపండితాదృతిఁ దవులువాఁడు

రామచంద్రశతక రచనాధురీణుఁడు
పద్మనాభనామ భాసురుండు
చిలకమాంబవిభుఁడు చిద్విలాసమ్ముల
నన్ను గాంచి యిటులు విన్నవించె;

చంద్రవంశపురాజచరితలు వెలయునే
బాదరాయణుఁ డెంచి పలుకకున్న
సూర్యవంశీయులసొబగులు తెలియునే
పుట్టఁబుట్టినదిట్ట పొగడకున్న

షట్చక్రవర్తులచరితలు నిలుచునే
సత్కవుల్ కృతులలోఁ జాటకున్న
దానతత్పరులకథానికల్ చెలఁగునే
కవివరుల్ కావ్యాలు కట్టకున్న

ఎంతవాఁడుకానీ, భూమి నెత్తివేయ
నీ, సముద్రమ్ములను బీల్వనీ, కులాద్రు
లెగురఁదన్ననీ, మఱి యెంతలేసిపనులు
చేయనీ, కృతిలే కవి చెప్పఁబడునె?

నన్నయ్య కృతి యీనినాఁ డల్లరాజరా
జెవ్వఁడో యెట్టిఁడో యెవ్వఁ డెఱుఁగు
తిక్కకవిబ్రహ్మ తీర్చి దిద్దనినాఁడు
మనుమసిద్ధి యెవండో వినఁగఁబడునె?
అష్టదిగ్గజముల నాదరింపకయున్న
నాంధ్రభోజునియూసు లడుగు నెవఁడు?
కోరి సత్కృతులఁ జేకొననినాఁ డవనిపై
నిలుచునే రఘునాథనృపతిమహా?

నాఁటినుండియు జగతి నీనాఁటివఱకు
పతులు కృతు లంది గాదె సుస్థితి గడించి
కనులకుం గట్టినటు యశఃకాయు లైరి
కాన నాకొకకృతి నందఁ గాంక్ష వొడము.

కృతి లేక భూపు లెక్కడ
కృతి గూర్పక కవులు నేడ; కృతకృత్యతకుం
గతు లీకృతు లే, చిరసు
స్థితికిం, గృతు లేలికలు ప్రసిద్ధి వహింపన్.

ఏయెడ నవ్యపద్ధతుల నింపెసలారక చొక్కు గొల్పి యా
హా యనిపించుఘట్ట మొనఁడైనను లేక రసప్రసక్తి సం
స్థాయము గాకపోయినఁ, గృతుల్ పరనిర్వృతిఁ గూర్ప గల్గునే?
కాయ మదెంత గల్గిన విగర్హ్యుఁడె యాత్మబలంబు లేనిచో.

వాసింప జీమూతవాహనచరితము
    గ్రథియించితివి పద్యకావ్యముగను
పావనం బగుజడభరతునిచరితము
    కవిత గూర్చితి పద్యకావ్యముగను
అపురూపకల్పన నలయహల్యామాతృ
    గాథ నల్లితి పద్యకావ్యముగను
అనవద్యసూర్యరాయాంధ్రనిఘంటుని
    రాత్మల నొకఁడవై మసలినాఁడ

వెన్నియొ పురాణగాథలు వన్నె కెక్క
గద్యకావ్యములుగఁ గూర్చి గణన కెక్కి
తల్లకవిసార్వభౌముచే నంది యుంటి
బిరుదు 'రసవత్కవి' యటంచుఁ బేర్మిమీర.

ఒకరామభక్తచరితము
ప్రకటంబుగఁ గృతిని బొంద భావింతు మదిన్
సుకృతాత్ముఁ జేయఁగా మా
మకవాంఛిత మీవు దీర్పుమా యని పలుకన్.

కవిని గృతి గోరువారలే కానరారు
అందు భక్తచరిత్రము నడిగి తీవు
భక్తశబరిచరిత్ర నీపాలికృతిగ
మెచ్చ రసికులు కృతి గూర్చి యిచ్చువాఁడ.

రాణ నొప్పారు పద్మపురాణగాథ
భక్తమాల యన్గ్రంథాన పరిఢవిల్లు
దానిఁ గొని యాదికావ్యార్థతత్త్వ మరసి
శబరిచరిత మాంధ్రమ్మున సంతరింతు.

వ. ఆపుణ్యశ్రీమణి కథావిధానం బెట్టిదనిన:—

---

# భక్త శబరి

శ్రీ మహారాజ్ఞి! వాంఛితదాత్రి! గాయత్రి!
సవితృదేవత! విష్ణుసదయహృదయ!
శ్వేతవర్ణ! కపర్దిశిఖ! పృథివీయోని!
పంచశీర్ష! మహాప్రభానుభావ!
షట్కుక్షి! త్రిపద! విశ్వామిత్రఋషి! చతు
ర్వింశతివర్ణ! వరేణ్యమూర్తి!
అమలాగ్నిసుముఖ! బ్రహ్మశిరస్క! ప్రాణాది
సప్రాణ! పద్మవిశాలనయన!

సారసాంఖ్యాయనసగోత్రి! సర్వలోక
ధీప్రచోదిని! వేదమాతృక! నమోస్తు
నాదబిందుకళామయి! భేదరహిత!
ముక్తిదాయిని! అంబ! నమోనమోస్తు.

లయు జగత్ప్రసిద్ధమయి వింధ్యమహాగిరి; సాలతాలని
ల పనసార్జునక్రముక సుందర చందన వృక్షధామమై,
లయిత మల్లికాకుటజ వాసితచంపక మాలతీలతా
లితమనోజ్ఞమై, కటకగండశిలామణి కాంతిరమ్యమై.

అచ్చటియుపత్యకాటవి నవనిజనులు
భవ్యవింధ్యాటవి యటంచుఁ బలుకుచుంద్రు
అట్టి వింధ్యాటవీభాగమై పవిత్ర
ధామమై దండకాటవి తనరుచుండు.

పుణ్యకథాసుధాబ్ధి కది పుట్టినయిల్లు, నిరస్తకిల్బిషా
రణ్యకపణ్యవీధి, స్మృతిరాజ్యరమాచరణప్రచార సా
ద్గుణ్యము, మౌనితాపసవిధుప్రథమానసభంబు, దండకా
రణ్యము, సర్వసృష్టికి శరణ్యము, పుణ్యజనానుగుణ్యమున్.

ఆయటవీప్రదేశమునయం దొకచో ఫలశాఖిసల్లతా
తోయసమృద్ధమై పరమతుష్టిని పుష్టి నొసంగుచున్ సదా
ప్యాయనమై మునీశసముపాస్యము నౌచుఁ బ్రశాంతమైన పు
ణ్యాయతనం బొకండు కలదయ్యె మతంగునియాశ్రమంబుగన్.

కలకలనాదమేదుర వికస్వరసుస్వరముల్ సెలంగఁగాఁ
దొలి చదువుల్ పఠించుచు మదుల్ చివురింపఁ ద్రికాలవహ్నులన్
గొలుచుచు వైదికక్రియలకున్ నెలవైనతదాశ్రమంబు భూ
తలతిలకం బగున్ సతతధర్మనిబద్ధమునిప్రసేవ్యమై.

ధార్మికత్వము, సుప్రశాంతతయు, దాన
ధర్మనిరతి, విద్యాదానదక్షతయు, స
దా తపోవృత్తి, సత్యసంధత, పరోప
కారపరతలె యందు నెక్కడను గనిన.

సొంపగు తామరతంపర
నింపులు నింపుచును నీట నీఁదెడియంచల్
గుంపులుగ నచ్ఛజలమై
పంపాకాసార మొందు పఱగును దానన్.

దాని కుత్తరముగ దమనుపురంబు నా
నొప్పుబోయపల్లె యుండె నొకఁడు
కొండజాతు లందుఁ గూడి వర్తించుఁ, గ్రి
వ్యాధగణము మించు వారిగణము.

అందలివా రనాగరకు లల్పులు ధూర్త లనక్షరాస్యులున్
మందులు క్రూరకర్మలు సమంచితచండ బలప్రకాండులున్
కందరు కల్లలాడఁ గసుగందరు జీవము లిట్టె తీయ, వా
రందఱి కందఱే మృగవిహారులు గుండెలుతీయుబంటులున్.

కర్కశుఁ డొక్కనాయకశిఖామణి వారల కుండెఁ, బాపసం
పర్కపరీతుఁ డాతఁడు, నిబద్ధిగ భీమబలుండు, నల్లనౌ
మర్కటరూప మాతనిది, మంచి యెఱుంగఁడు, వానిమూపు లా
లర్కవిషప్రకీర్ణము, లలక్ష్యుఁడు వానికి నుగ్రుఁ డేనియున్.

రక్కసుఁడు క్రూరుఁడయ్యు హిరణ్యకశిపు
గర్భమున భక్తిభావసంకలితహృదయుఁ
డల్లప్రహ్లాదుఁ డుదయించినట్లు, శబర
ధూర్తనేతకు నొక్కకూఁతురు జనించె.

మురిపెమున నంగరక్షలు
జరిపించుచు శబరుఁ డాత్మజన్ సాకుచుఁ ద
త్పరవృత్తిఁ బెంచె, నామెకు
జరిగె నిరువదేండ్లవయసు నసిచక్కంగన్.

జనికర్తృప్రకృతితత్త్వసంస్కృతిని గాంచంబోక, యేకాంత పా
వనభావంబుల, నీతిపద్ధతుల, పంపామజ్జనధ్యాన పూ
జనతాత్పర్యములన్ జరించుచు సదా సద్గోష్ఠులన్ వించునే
తనివిం గాంచును; గుల్కరాలగని రత్నంబయ్యెఁ దజ్జన్మమున్.

పసుపుం బూసియుఁ గుంకుమం బలఁది ధూపం బిచ్చి నైవేద్యమున్
గుసుమంబుల్ ఘటియించి మ్రొక్కు లిడు నేకొండ్రాయి గన్పించినన్
మెసవుం గాయకసర్లు నాకలము లే మేలంచు నెవ్వేళలన్
మసలంబోవును దవ్వుదవ్వుగ భయంబా భక్తియా యామెకున్?

కనఁబడినచెట్లకుఁ బ్రద
క్షిణముల్ సేయుచు నదేమొ చెప్పికొనును, దా
వినమితయై చేతులతో
వనస్పతుల నద్దుకొను నవారితభక్తిన్.

మనసున కిష్టమైనయెడ మాటలు సెప్పును; లేచి యన్నముం
దినుఁ, దొడవుల్ ధరించు, గుసతించును బెద్దల; నిష్ట మేదినన్
విన దెవ రెంతచెప్పిన; వివేకము గల్గిన దానా? లేనిదో
యనుట కసాధ్య, మామె జననాంతరకర్మబలం బదెట్టిదో!

ఇదియోగిని యిది పిచ్చిది
యిది వెఱ్ఱిది మూర్ఖురాలు నింగితమే లే
నిది యనుచు నంద ఱాడఁగ
నది వినియున్ వినని యట్టు లాస్త్రత మసలున్.

ఇట్టియీడేరినట్టి యీపట్టిచర్య
లర్థమే కాక తలిదండ్రులామె నిల్లు
నెడల నడచిరి; ప్రజ లిట్టు లుడుకునెట్ట
నెవ్వరు భరించుచున్ నిగ్రహింపఁగలరో?

మగఁడా ముద్దుల? యిల్లు వాకిలియు? సమ్మానమ్మ దుర్మానమా?
జగడాలా శుభశోభనాల? సుతులా శ్లాఘించుచుట్టాల? యీ
యిగురుం బోఁడికిఁ; దాదృశస్థితియె హాయింగూర్చె నం చెంచుచున్
దగురీతిన్ వనవీథులం దిరుగుచున్ దర్శించు సన్న్యాసులన్.

నట్టడవిం జరించు చొకనాఁ డది గాంచె సమస్తమాసిరాట్
పట్టము గట్టుకొన్న మునివర్యుని, సన్నుతసత్త్వభావసం
ఘట్టితపడ్రిపుప్రకరుఁ గారుణికోత్తము నమ్మతంగునిన్
జట్టులు చుట్టునుం గొలిచి సారపుధర్మము లాకళింపఁగన్.

భసితత్రిపుండ్రాంకఫాలభాగమ్మున
కుంకుమతిలకమ్ము కుదురుకొనఁగ
బొద్దుగడ్డము మీసముల్ కనుబొమలును
జడలతో సయ్యాట సలుపుచుండ
గాడకుద్రాక్షలు కంఠమ్మునను వ్రేలి
గొప్పబొజ్జకు వన్నె గూర్చుచుండ
కటిభాగమందునఁ గాషాయవస్త్రంబు
జలకుండికయుఁ బార్శ్వమున వసింప

మఱ్ఱినీడను జేరి నేమమ్ము తొలఁక
ఠీవి వ్యాఘ్రాసనమున రెడ్డిగము వైచి
చూపులను జేతులను ద్రిప్పుచున్ మహోప్ర
వచనముం జేయుమౌని నావనిత గాంచె.

ఆతనిఁ గనుఁగొనినంతనె
చేతోభయః విభ్రమాతిశీర్ణావస్థా
ఘూర్ణితసర్వాంగయు నై
యాతన్వి చలించి పర్వె నతివిహ్వలతన్.

చనిచని కొంతదూర మట సాగి మొగం బటు ద్రిప్పి యామునిన్
గనుఁగొనుచుం దనంతనె యకారణబంధుత యేదొ యీడ్వ నేఁ
బనిగొని పుణ్యసేవల నిబద్ధిగ వీరిని గొల్తునేని యీ
జనియును ధన్యమౌ ననెడిచక్కనియూహ జనించె నెమ్మదిన్.

అనువర్తించిన పూర్వజన్మసుకృతం బావేళ కావేళఁ దా
ననుకూలింపఁగ దైవనిర్ణయము తోడై రాఁగఁ గ్రైరాతి కా
మునిపైఁ గల్గినభీతి భక్తిగను మార్పుం జెంద నారీతిగాఁ
దనలో నూహలుసేసెఁ; గాక కలదే ధన్యత్వసంసిద్ధియున్?

సరిగఁ గనులెత్తి వీక్షింపఁ జాలకుంటి
వీనిదరిఁ జేరి యెటులు సేవించుదాన?
అందరానిదుర్గమ గగనాంతరాల
పథము నంటినరిక్కను బట్టఁగలనొ?

తక్కువజాతికిఁ బుట్టిన
బక్కను విజ్ఞానశూన్యఁ బరమర్షిని నే
నెక్కరణిఁ దరిసి సేవలఁ
జక్కఁగ మెప్పింతు నిది యసాధ్యముకాదే!

వ. అని తలంచి నెమ్మనంబున,

ముంగిళులుం బెరళ్లును ముముక్షువు లాముని లేఁగుదార్లు నా
యంగణముల్ విశుద్ధు లనయంబును నూడిచి యల్కి ముగ్గులన్
రంగుగఁ బెట్టి యొరికిఁ గనంబడకే నడురాత్రులందు ను
ప్పొంగుచు వంటకట్టియల మోఁపు లొసంగుచుఁ జాటుమాటుగన్.

పూజలకుఁ బూలు భోజనంబులకుఁ దామ
రాకు లనఁటాకు లరుఁగులయందు నునిచి
చిదుకులుం బిడుకలుఁ బ్రోవుసేసి మునుల
వాకిళులఁ బెట్టి మౌనిసేవలను దీర్తు.

ఆలం గట్టెడియా కో
ట్టాలకు బాగిచ్చి, మునిమఠంబుల, నా దే
వాలయములెల్లఁ దుడుచుచు
నీలీలన్ మౌనిసేవ లే నొనరింతున్.

అప్పన మిట్లు సేసిన మహర్షికి సత్కరుణార్ద్రవృత్తి తా
నెప్పటికేని రాఁగలుగదే! యిదె దారి యిదే నిదాన మీ
చొప్పునెగాక వేఱియునచోఁ గడతేఱవు నాసపర్యలున్
దప్పునొ తాఁకునో మునికిఁ దప్పఁగ దోఁచునొ యేమిపుట్టునో?

అని తలపోసి ప్రత్యహము నర్ధనిశాసమయంబులందె మే
ల్కని మునిపల్లె సేరి తనకార్యములెల్ల ముగించి యెవ్వరున్
గనుఁగొనకుండఁ బోవు; చిరకాల మిటేఁగ నెఱింగి యాపసుల్
మునివరులెల్ల రాత్రిమపుముచ్చటలం బలుకన్ మతంగుఁడున్.

ఇట్టు లకారణమ్ముగ నిరీహులునై పరమార్థవృత్తిఁ జే
పట్టి యొనర్చువా రెవరొ భావ్యము వారి నెఱుంగ, నింకఁ గన్
పెట్టఁడు మీకు మీరని మునిప్రవరుండు మతంగుఁ డాడ; జే
పెట్టి తదాజ్ఞ నౌదలలఁ బెట్టుచు నేఁగిరి శిష్యులున్ మునుల్.

చెట్టులు పుట్టలుం దిరిగి చెంతలకొండలఁ గోన లీరముల్
మెట్టుచుఁ బల్లెపట్టులు క్రమించుచుఁ గన్నదువారి నద్దుచున్
చట్టులు సర్వథా వెదుకసాగిన, వార లెఱుంగకుండుటన్
గుట్టుగఁ గాఁచి రాత్రిమపుగొందుల సందులఁ జెట్లచాటులన్.

అడలుచు వచ్చి బోయెతయు నయ్యపరాత్రినె దారులన్నియున్
మసుచుచు మెల్లనౌనడలతో నడయాడుచుఁ గట్టెమోఁపు లె
ల్లెడలను జేర్చి, పోవుటకు నెంచుచు నుండఁగ శిష్యు లిద్ద రా
పడఁతిని దొంగఁ బట్టినటు పట్టిరి; దానికి గుండె ఝల్లనెన్.

ఎవ్వతెవే కిరాతి? యిటు లేలొకొ మార్గము లూడ్చ్వా? నీకు ది
క్కెవ్వరె? యింధనమ్ము లిటు లీయఁగ నేఁటికె? యీనిశీథమం
దివ్వనభూమి కొంటరిగనే పఱతెంతు వదేల? పూజకున్
బువ్వులు గూర్చు వెయ్యది మనోగతమో తెలియంగఁ బల్కవే.

నీవు పరిచ్ఛిన్నవృత్తివై నెఱపునట్టి
సేవలకుఁ బ్రతిఫల మపేక్షింతు వెద్ది?
కులపతులు నిన్ను బట్టంగఁ గోరి రిపుడు
పదవె వారిసన్నిధికి నిర్భయముతోడ.

గడగడలాడి వారలనిగారవుఁబల్కుల కామె భీతిచే
నుడులు నడల్ దడంబడ మనోగతమున్ వెలిఁబుచ్చఁజాలకే
బడిబడి వందనంబు లిడు, బాబులు బాబులు వద్దు వద్దు నన్
విడువుఁడు నీచజాతిని వివేకవిహీనను దప్పొనర్చితిన్.

నాయవివేకమున్ మఱచి నన్ను శమించి క్షమింపుడయ్య పా
పాయతనంబు నాబ్రతుకహో జని వ్యర్థము; నాకు నెవ్వరున్
సాయము లేరనాథ నపచార మొనర్చితి నజ్ఞురాలనై
మాయయు మర్మముం దెలియనైమల యొనర్చితిఁ బుణ్యభూములన్.

నన్నుఁ గొనిపోకుఁడీ గురుసన్నిధికిని
నగము చచ్చితి నిప్పుడే చాలు బాబు,
గురులయెదుటనె నను నిల్పికొన్న యెడల
పూర్తిగాఁ జత్తుఁ దండ్రి మీపున్నెమాయె.

దీనాతిదీనయై యిటు
మానక బ్రతిమాలుచున్న మానినిఁ గని యే
మైనను దప్ప దనుచు నా
చానం గొని నిల్పిరి గురుసన్నిధిలోనన్.

గుహుఁ డామెం గని నీవఁటే యిపుడు మాకుం గూర్చుచుట్టమ్మవై
గురుశుశ్రూష లొనర్చుచున్నయది? యేకోర్కెల్ మదిం గల్గు? నీ
గురు లెవ్వారొ? నివాస మెచ్చటనొ వాకొవే యథార్థంబు, త
త్పరతన్ నీవొనరించు సేవలకుఁ జిత్తం బుత్తలం బందెడిన్.

అన నామెయు స్వామి! యనా
థను దీనను శబరజాతిదానను మీపా
వనభూము లంటువఱచితి
ననుకొనలే దింత వచ్చు నంచు మహాత్మా!

కొండదొరకూఁతునై పుట్టియుండి కూడ
నాది పెడదారి యాట మన్ననలు దక్కి
వెడలనడఁచిరి జనకు; లాగడియనుండి
తిరుగుచుంటిని నాయాత్ర జరుపుకొనుచు.

ఓడక యీవనిం దిరుగుచుండఁగ నొక్కదినాంతమందు మీ
జాడలు గాంచియుంటి నుపచర్య లొనర్చి భవత్ప్రసాదముం
బొడిమిఁ బొంద నెంచితినిపో, యెటు లబ్బును నీచజాతికిన్
కూడును గూడదంచు ననుకో కిటు సేసితి నోదయామయా!

నీదారి బాగొనర్చిన
నాదారిని నీవు బాగొనర్తువటంచున్
కాఁదారి ప్రొద్దులందున
నీదారిని బట్టుకొంటి నేను మునీంద్రా!

అనుచు వచింప దానిజననాంతరముల్ తనదివ్యదృష్టిఁ గ
న్గొని భవితవ్యతాదశలునుం గని యెంతటిధన్యురాలవే
వనచరి యంచు లో నణఁచి మెచ్చుచు భావము నుబ్బనీక, దీ
నిని మనయాశ్రమాంతముననే తగురక్ష లొనర్చి నిల్పుఁడీ.

అన్నపానము లిడుచుండి యనవరతము
నరయుఁ డేలోటు లేకుండునటులు మీకు
ఈయమాయకురాలు నిర్హేతుకముగ
ఋషుల సేవించు నేనాఁటిఋణబలంబొ?

మునికులచంద్రుపల్కులకు మో మువాంచుచు విన్నవోయి త్రో
డన పడి మొక్కి మాటలు తడంబడ నిట్లను నో మహాత్మ! పా
వనగుణభాసి! మీ రిడెడిపాత్రకృతభోజనమందు లేదు నా
మనసు; భవద్దయామయ సమంచితభక్తికినై తపించెదన్.

నా కొకకాంక్ష లేదు మునినాథ! మహావిభవంబులందుఁగా
నీ; కలమాన్నభోజ్యముల నేని; సుతల్పగృహాదులందుఁగా
నీ; కమనీయభోగముల నేనియు; సంసృతియందుఁ గాని; నే
నేకరణిన్ సుసంస్కృతి గ్రహించుచు సద్గతి నొందుదాననో?

అట్టి యాశీస్సుల నొసంగుమా మహాత్మ!
దీని కిటు సేసి నిన్ను సంధించికొంటి
మంగలా దూలమా యిది? తుదకుఁ గనిక
రించి కడకంటఁ జూడఁ దరించిపోనె?

కనదురుభక్తిభావపరికల్పిత జల్పిత మాధురీధురీ
వినదము లాలకించి రమణీ! శబరీ! కడునిర్భయమ్ముతో
మను మిట; నీసపర్యలను మానక చేయుము; మా కనింద్యవై
వినయమునన్ మెలంగుము; వివేకము వీడకు క్షేమ మయ్యెడిన్.

శబరీ! విశీర్ణపింగల
కబరీ! నిబిరీసభక్తికంజభ్రమరీ!
శబలితకాచమణిసరీ!
నిబంధనము నీకుఁ గల్గునే? పుణ్యధురీ!

పసిగాఁ జూచి మతంగమౌనియును వాచారూఢి భాషింపఁగా
విషమం బేమియు లేదు నీకలనఁ దన్వీ! లెమ్ము రమ్మంచు, సం
తస మేపార గురూక్తపద్ధతిగఁ గాంత న్నిల్పి రాశిష్యులున్,
మసిబోగైనను మానికం బగునుసుమ్మా పూజ్యసేవాదృతిన్.

అమలపంపానదికిఁ బశ్చిమముగ నొక్క
పర్ణకుటిఁ గాపుర మ్ముండి ప్రతిదినమ్ము
పరమగురుసేవ, మునిసేవ, నెఱపుకొనుచు
వచ్చుచుం బోవుచుండె నావనితమిన్న.

గురుఁ డాదర్శము; వేదబోధలె గురూక్తుల్; సత్పథమ్ముల్ తదా
చరణమ్ముల్; పరమార్థముల్ తదుపదేశమ్ముల్; తదిష్టమ్ము సం
తరణోపాయము; తత్ప్రసాదము మహాధన్యత్వసంసిద్ధి గాన్
గురుఁడే దైవము దైవమే గురుఁ డటంచున్ భావనన్ నిల్పుచున్.

పరిచర్య లొనర్చుచుఁ ద
త్పరతం జరియింప మునివతంసుండు దయన్
వరరామతారకము నా
పరిచారిక కుపదిశించెఁ బరమప్రీతిన్.

యాతాయాతము లామె పూనికడ కత్యంతాప్తతన్ నిత్యమున్
చేతఃప్రీతిగఁ జేయఁ గాలము గతించెం గొంత; యాలో వృథా
జాతక్రోధులు కొందఱా యెదలవిశ్వాసంబు లెక్కింపకే
మూఁతుల్ నొక్కుచు ముక్కువ్రేలిడుచుఁ జొప్పల్ దప్పి రెగ్గాడుచున్.

ఎక్కడిపాపజాతినొ మునీంద్రులవాడకుఁ దెచ్చి, దాని నిం
దొక్కెడఁ బర్ణశాల నిడి యోనుచుఁ, దాఁ బనిగొంచు, బోధ లన్
జక్కనిసొంపు నెట్టి సరసంబుల నాడుచుఁ బాడు చామెతో
నొక్కనిమిషమేని విడకుండె మతంగుఁ డటంచుఁ గొందఱున్.

తీరుల్ దిద్దుచుఁ బెద్దయై మునుల కెంతేఁ గూర్చుమాతంగుఁ డీ
దారిం బట్టెను, బెండ్లియాడుకొనరాదా యిప్డిరున్; దొంగసం
సారం బేమిటి కాత్మవంచనము? మెచ్చంబోలునో పుణ్యసం
సారుల్ దీరిచియున్న చోట నిటు దుశ్చర్యల్ ప్రదర్శించుటల్?

పరమసత్యతపఃప్రభావున కీకొఁడు
కాంతతో సంపర్కకర్మ మేమొ?
వేదవేత్త త్రికాలవేది కీశాబర
వనితతోఁ దగని మంతనము లేలొ?

మతిఁ దృణీకృతజగత్త్రితయున కీబోయ
భామకావించు సపర్య లేలో?
నిర్వికల్ప సమాధినిష్ఠున కీకొండ
నెలంతతో నిత్యసాన్నిధ్య మేమొ?

మహిని లోకోత్తరుం డగు మానిచంద్రుఁ
డింతయజ్ఞానమున మ్రుంగు టేమియొకొ?
కాంత లెంతకాదురు? కడవంతయైన
గుమ్మడియుఁ గత్తి కెపుడు లోకువయెగాదె!

గడిదేఱుపరిజ్ఞానఘనులందు జూపనిఁ
జూపను యోగవిశుద్ధులందు
ఆజన్మతపస్విపుంగవులందునఁ జూపని
చూపని సత్తపశ్శూరులందు
ఆదృతాంతేవాసులందునఁ జూపని
చూపని యాశ్రమసుతులయందు
తులలేనిక్రతుసంతతులయందుఁ జూపని
చూపని పరతత్త్వరూపులందు.

పరమవాత్సల్య మీమునిప్రవరుఁ డిపుడు
చూపుచున్నాఁడు శబరిపైఁ జోద్యముగను
దీని పూర్వపుణ్యము మంచిదే యటంచు
చెప్పికొనుచుండిరి మతంగశిష్యు లెలమి.

దండకావాసు లిట్లు మతంగుఁగూర్చి
దూషణాదులు భూషణాదులును బలుక
పొంగకయుఁ గుంగకయు యథాపూర్వముగనె
మెలఁగుచుండె నావాచంయమిప్రవరుఁడు.

మునుపటిరీతి నాప్తమునిముఖ్యులు పెద్దలునున్ స్వగోత్రజుల్
తనయుపదేశముల్ విన ముదంబునఁ జేరరు పల్కరింపరున్
గానకొని తన్ హసింత్రు గుమిగూడుచు; మానిరి పంక్తిభోజనా
దిని; నెవ రెట్టులైనను మదిన్ గలఁతం గొనఁ డమ్మతంగుఁడున్.

పెద్దలు పల్కుటల్, కడు హసించుచు డగ్గరి యేవగించి త
న్నడ్డముగొట్టుటల్, గురులయం దపనిందలు వేయుటల్, కుటిన్
బెద్దల రువ్వుటల్, శబరుబిడ్డ గనుంగొని నవ్వుఁ గానటుల్
సాక్షులుగాఁ దలంప దటు సూడడు వీడడు హానిసేవలన్.

జోకల్ గట్టుక లోకు లాడుకొనురజ్జుల్ పజ్జలం జేస్తుమే?
లోకుల్ కాకులు వారినోరులకె చెల్లున్ సర్వ, మేకజ్జని
ప్రాకజ్జన్ దెగఁగాల్చుఁ బొమ్మనుచు నిత్యానందుఁడై వారలే
పోకల్ పోయినఁ గాఁక చెందఁడు, మహాత్ముల్ లోకకౌటుంబికుల్.

నిష్కలంకచరిత్రుఁడై నెగడ మునియుఁ
దీరు లిటు సాచు నేండ్లు గతించెఁ గొన్ని
పిదప నంతిమదశ సమీపింపఁ దనకు
నయ్యది గ్రహించి దర్భశయానుఁ డయ్యె.

గురునిర్యాణ మెఱింగి శిష్యులును నాక్రోశించి, తత్కాలస
త్పరిచర్యల్ సలుపన్; నమస్కృతులఁ జింతావ్యగ్రురాలయ్యుఁ ద
త్పరభక్తిప్రవణాత్మయై శబరి యాబ్రహ్మర్షికిన్ సేవలన్
నెఱపున్ డగ్గరు బేలయై మునిని గన్నీ రుబ్బ వాపోవుచున్.

నా కొకశక్తి నిచ్చి గురునాథ! ననుం గరుణించి సేవలన్
గైకొని భక్తితత్వపరికల్పితబోధ లొసంగి నన్నిటుల్
తేఁకువ దిద్దుకొంటిరి; గతింపఁగఁ దా మిటు, దిక్కుమాలి నే
నేకరణిన్ వసింతు నిట నెవ్వరిఁ బట్టుదు నంచు బెగ్గిలన్.

దానియవస్థ గాంచి జడదారియు బిడ్డ! విచార మెందుకే
మానుము నీకు సంతరణమార్గము దెల్పెద, నేఁ డయోధ్యలో
మానవమాత్రుఁడై హరి యమానుషచర్యల నుండె, రాఁగలం
డానతభక్తపాలనసమంచితదీక్షలు పూని యీడకున్.

నీలమేఘశ్యాముఁ డాలోలసువిశాల
కమనీయపద్మనేత్రములవాఁడు
ఆజానుబాహుండు సౌజన్యమధురమో
హన మైనయట్టియాననమువాఁడు
అతిలోకబలుఁడు దీర్ఘతరోగ్రకోదండ
మండితాకార సంపదలవాఁడు
స్మితపూర్వభాషి పాలితసర్వధర్మత
త్పరతానుమేయ బోధమ్మువాఁడు

వరజటామకుటాంచిత శిరమువాఁడు
జలదగంభీరనిస్స్వన స్వరమువాఁడు
సానుజుం డౌచు నిన్ను గాంచంగ వచ్చు
నెంచి శ్రీరాము నిట్లు పూజించికొనుము.

అతఁడు సనాతనుండు, పరమాత్మునియంశను రామనాముఁడై
క్షితి నవతారమెత్తె, నిను జేరఁగలాఁ డతిథిప్రపత్తితోఁ
గతిపయహాయనంబుల; నికామసపర్యల నాతిథేయమున్
గొతకక సేయు మాతఁ డొసఁగుంజుమి మోక్షము నీకు మానినీ!

ఉవిద! తెల్పితి రాఁగలయోగఫలము
నెఱిఁగి రామనామము జపియించికొనుము
అడరి మత్సేవ లొనరించినట్టిఫలము
పొందుదువుగాని; యిపుడు నాపొద్దు గుంకె.

కనిపెట్టుఁడు దీనిని మ
న్నన; నీమె మహానుభావ; నారాయణుఁ డీ
మెను జూడ రాఁగలండో
యనుంగుశిష్యులు! పరాకు నందకుఁ డింకన్.

అని వచించుచునే కన్ను లట్టె మొగిచి
భవ్యయోగానుసంధానపరత మెలఁగి
తైలశూన్యదీపికవోలెఁ దనువు కునుక
నామతంగుఁడు బ్రహ్మైక్య మందుకొనియె.

దిక్కఁటి దీనురా లయి మదిన్ దిగు లంది కృశించి వంతలన్
బొక్కియు సుక్కి యాశబరి పోయినసద్గురుఁ గూర్చి వెంగచేఁ
జిక్కుచు నుండియున్ హరి భజించుచు నిచ్చలు రామనామమున్
దక్కము; సద్గురూక్తులెగదా ములుఁగఱ్ఱలు శిష్యజాతికిన్.

ఆకులుఁ గాయలుం గసరు లన్నముగా నతిశుష్కగాత్రియై
లోకపుఁజింత లన్నియు విలుప్త మొనర్చుచు రామనామమే
వాకొనుచుం దదాగమనవాంఛను దిక్కులు సూచుఁ గాని తా
నాఁకలిదప్పు లెన్నదు నిరంతరపావనరామభావనన్.

భజన లుపవాసములు పుణ్యభావనములు
నతులు నుతులును బూజ లారతులు, ధూప
దీపములు నెట్టివిన్ నివేదింప నున్న
రామ రామార్పణముగ సర్వ మ్మొనర్చు.

అర్ధమ రేయివేళఁ గలయందున రాముని గాంచి లేచి నా
ముద్దులసామి! దాశరథి! మోదమునం జనుదెంచితయ్య? యా
పద్దశ లెల్ల నావి తెలవార్చుము రామయతండ్రి యంచుఁ దాఁ
బెద్దగ నార్చుఁ గంటఁ దడివెట్టుచు బారలు చాచి పర్విడున్.

నేఁడే రాఁగలఁడేమొ రాముఁ డటులేనిన్ దొడ్డరాబిడ్డ నే
నేడం బండఁగఁ జేయు? దే మిడుదు? నే యేరీతి సేవింతు? నీ
జాడం బాదము లొత్తు; దిచ్చటనె మంచంబుం దగన్ వాల్తు; నీ
గోడం జేరిచి యాసన మ్మిడుదు; మొ్రక్కుల్ దీర్తు నిప్పట్టునన్.

వ. అని తనమనంబున భావించుచు,

అలికియు ముగ్గు వెట్టి కలయంపులు చల్లియు నాకుదోరణం
బులు సమకట్టి పచ్చిపసుపున్ గడపన్ ఘటియించి, తెల్లచు
క్కల నిడి, ముంగిళుల్ దుడిచి, కమ్మనితేనెలు, పూలు, బండ్లు, ని
స్తుల మగుభక్తితత్పరతతో సమకూర్చును రామసేవకై.

పుల్లనౌ పండ్లు రఘుపుంగవునకు నొసఁగ
నతనిపల్ చాలు పులిసిపో నౌ నటంచు
ప్రతిఫలమ్మును దనముని పండ్లఁ గొరికి
మధురతం గని యెంచి రామయ్య కుంచు.

చక్కని సౌరభంబు వెదచల్లెడి యేకుసుమంబుఁ గాంచినన్
మిక్కిలి యందమైన రుచిమించినసత్ఫల మేది చూచినన్
మక్కువఁ దెచ్చియుంచి యిది మారఘురాముల కంచు దాఁచుఁ బెం
పెక్కినభక్తి గంతు లిడు; నెప్పుడు రాముఁడు వచ్చునో యనున్.

ఉలికిపడి లేచి చయ్యన నెలికి వచ్చి
యన్నివైపులు గాంచి రామయ్యతండ్రి!
మొద్దునిద్దుర మున్గి తీపొద్దె వచ్చి
కాంచి పోలేదుగదర నాకన్నతండ్రి!

వ. అనివాపోవుచు,

ఆకల్లలాడినంతనె
రాకాశశిముఖుని రాము రాకలె యనుచుం
జేకొన్న పనిని విడుచుచు
నాకడ కీకడకు నడచి యట్టిటు చూచున్.

కాయముపై నశించె మమకారము; కట్టినపుట్ట మూడ్వఁగాఁ
బోయెను దెప్పి; యింద్రియపుఁబూయములన్ దొలఁగింప దాఁకలిం
బాయఁగఁబెట్టె; దన్నయనుబంధములెల్లఁ ద్యజించె; సర్వదా
ధ్యేయము రామనామ, మతిహేయము లన్యము లయ్యె దానికిన్.

రామోత్కంఠితయై యిటు
భామామణి శబరి పొల్లు పడుచుండఁగ నా
రామునిరాక లెఱుంగుచు
ధీమంతులు మునులు సభలు తీర్చి రొకయెడన్.

వారలతీరు లెన్ని రఘువర్యునిరాకలు గల్గునంచు సం
భారములెల్లఁ గూర్చుకొని పంపకుఁ బోయెను మజ్జనార్థ మా
దారిని బోవునాశబరదానికి స్నాతుఁడు ధృష్టుఁడౌ జటా
ధారి యొకం డెదుర్పడఁ బ్రదక్షిణముం బొనరించె వానికిన్.

మునికి మ్రొక్కినపుడు దననీడ యాతనిఁ
దాఁకె నంతలో నుదగ్రవృత్తి
మండిపడి ప్రచండమార్తాండుకై వడి
రేఁగి యతఁడు తీవ్రవృత్తిఁ బలికె.

ఏలే తాఁకితి నీడతో నను కిరాతీ! యెగ్గు లే దోసి చాం
డాలీ! నామడి మండఁబెట్టితివి రండా! జన్నిదం బయ్యయో
మైలం బడ్డది; బ్రహ్మయజ్ఞమును నేమంబెల్ల పాడయ్యె నీ
వేళన్ వేకువ లేచి యేముఖము నే వీక్షించియున్నానొకో?

చెప్పరానిదాన! చెఱిచెదే? తాఁ జెడ్డ
క్రోఁతి వనము చెఱుపఁ గూడినటులు
ససిగ నేలినాఁటిశని వైతి మావాడ
కెగ్గు సిగ్గు లేని యెబరాసి!

తక్కుచుఁ దారు చిట్టులె మతంగమహామునియంతవానినే
చక్కఁగ భ్రష్టొనర్చి సరసాలకు దింపితివేగదా, నినున్
ముక్కలు చెక్కలౌ నటుల మోదినఁ బాపము గల్గదోసి, నీ
టక్కులు సాఁగ వియ్యెడఁ దుటారికటారిమిటారి! హా మ్మిఁకన్.

అగ్రహారంబులోనఁ గాలాని యిటులు
దాఁపురమ్మైతి బ్రాహ్మ్యము తగులఁబెట్ట,
అనుచు మరలఁ బంపానది కరిగి మునిఁగి
మైలఁ దొలఁగించుకొనె నఘమర్షణముల.

నేలన్ నింగి నెఱుంగకుండ నిటు లెన్నోఁ గూయునాక్రోపచం
డాలుం డాగురుసాధునిందకుఁడు స్నానం బాడఁ బంపాజలం
బాలోఁ బ్రువ్వుచుఁ బూతిగంధకలితంబై రక్తవర్ణంబు గా
నాలీలల్ గని హేతువుం దెలియ కత్యంతార్తులై రమ్మునుల్.

“సజ్జనంబులు సద్భక్తి మజ్జనములు
సేయ నన్నీరు పన్నీటిచెలువు నొందు
సుకృతహీనులతనువులు సోఁకెనేని
కజ్జలముభావమును బొందుఁ దజ్జలంబు”

ఏల కోపించెనో మౌని యేమిదోసఁగుఁ
దా నొనర్చెనో? యొప్పును దప్పు నెఱుఁగ
కడలి కోచించి శబరి దీనాస్య యగుచు
తన నెలవు సేరె శ్రీరాముఁ దలఁచికొనుచు.

రాముఁడె రక్షకుండు రఘురాముఁడె నాయిలవేల్పు జానకీ
రాముఁడె తోడునీడ ఖగరాజతురంగుఁడె దిక్కు నాపరం
ధాముఁడె నాకు నేడుగడ దర్శనభాగ్య మొసంగి రామ! నా
బాములు దీర్ప రాఁగదవె భక్తజనావన! దీనబాంధవా!

అవమతి నీదుసంస్మరణమందునఁ జూపఁగ లేదు జిహ్వ, త్వ
చ్ఛ్రవణమునం దపశ్రుతుని జాటఁగఁ బోదు శ్రవోయుగంబు, వా
స్తవముగ నీదుపూజల సదా నెఱపం గర మోటుపోవ, దే
యవకర మున్న దియ్యెడ? దయామయ! యీశబరిం దలంపవే.

నాధర్మమ్మును దప్పదాఁటితినె యేనాఁడైన? మీపాదసే
వాధీనమ్ముగ నిల్వదో మనసు? లేదా మౌనిసేవాధృతిన్
సాధుత్వంబును గాంచ కుండితినొ? నీసాన్నిధ్య మందించి నా
బాధల్ తీర్పఁగ రావదేల? కరుణాపారీణ! రామప్రభో!

నీరూపుండ వటంచుఁ బల్కుదురు కానీ సామి! యీపుణ్యకాం
తారం బందలిగట్లలో తరులలోనం బూలలో పండ్లలో
నీరంధ్రోరునికుంజపుంజములలో నిక్షేప మైనట్లుగా।
నీరూపంబె కనంబడున్ గనుల కెంతే మాధురీధుర్యమై.

అలికులకలరవములలో
కులికెడికలకంఠమధురకూజితములలో
చిలుకలపలుకులలో నీ
పోలు పగునామాక్షరములెపో వినిపించున్.

పటుతరయత్నముల్ సలిపి పాపపుంజింతలలో మునింగి యు
త్కటమగుఘోరకార్యములకై యొడిగట్టియు మూఁడునాళ్లము
చ్చటకయి పొంగి బోర్లగిలి చచ్చెడిదాఁక పెనంగులాడునీ
కుటిలశరీరి కేగడియకో తగుమోక్షము దీనబాంధవా!

ఎమ్ములు చర్మమున్ మిగిలి యిట్టు కృశించి నశింపనున్న దే
హ మ్మిది, చూడ నందదుకు లైనది, కుట్టుసురుల్ దొలంగ; వీ
యిమ్మన నుండఁజాలను హరీ! తెలవార్చుము దీనిబాములన్
అమ్మకచెల్ల! 'ఉప్'అనిన నారెడిది వ్వెకు నింతయత్నమా?

అయ్యయొ రామ! యింతచలమయ్య? ననుం గనరావటయ్య? నా
కుయ్యి వినంగదయ్య! యెటకుం జనితయ్య? యెఱుంగలేవె నా
తియ్యము నెయ్యమున్? మదిఁ గదించినయీకడజాతిదాని కీ
వయ్య భవత్సుదర్శనము; హా; రఘువీర! మొరాలకింపరా.

వ. అని విలపించుసమయమున,

"ఆకర్ణాయతనేత్రుఁడై మణిమయోద్యత్కుండలద్వంద్వశో
భాకీర్ణాంచితగండుఁడై సురదనుండై సుందరభ్రూయుతుం
డై కమ్రస్మితచంద్రికావిలసితుండై సానుజుండైనయా
కాకుత్స్థాన్వయరామచంద్రుఁడట సాక్షాత్కారమయ్యెన్ దయన్"

ఆకోదండధరత్వ మాభుజబలోదగ్రైకవష్టంభ మా
లోకానుగ్రహతత్పరత్వమధురాలోలేక్షణద్వంద్వ మా
రాకాచంద్రనిభప్రభాననము రారాజజ్జటాజూటమున్
సాకల్యంబుగఁ గాంచి యాశబరి యానందాబ్ధినిర్మగ్నయై.

ఆడుచు నొడలు నెఱుంగక
పాడుచు నానందకలితపావనగీతుల్
వేడుచు మోక్షంబును దూఁ
గాడుచు నారాముపదము లంటి నుతించెన్.

రామా! జగదభిరామా!
రామా! రఘువంశసోమ! రణభీమా! శ్రీ
రామా! ముఖజితసోమా!
రామా! నాముప్పు దీర్పరా జయరామా!

ఎచ్చోటివాఁడ వెచ్చటి కహీనదయం గనవచ్చితయ్య నా
పుచ్చలుపూచెనయ్య యడవుల్ నడువన్ మృదుపాదయుగ్మమున్
నొచ్చినదేమొ యొత్తెద ననుం గృపఁగాంచి భవంబు వాపి నా
యిచ్చను దీర్పవయ్య నృహరీ! శబరిన్ గడకంటఁ గాంచవే.

కట్టెండ తాఁకునఁ గమలిపోవుట నేమొ
కప్పారె నీమేను కన్నతండ్రి
వడదెబ్బచే జాజువాఱిపోవుట నేమొ
చూపు లెఱ్ఱగ సాఁగి సోఁగలయ్యె

కాలినడాబాట కడచి వచ్చుట నేమొ
    పదము లెఱ్ఱఁదనాన గుదులుకట్టె
తాఁపమ్ము సోఁకి యుత్తల మందఁగా నేమొ
    తెల్లనై చిఱునవ్వు లల్ల వెలిసె

ఎక్కడియయోధ్య దండక యెక్కడకట!
ఎచటి రారాచకొమరుఁడ వెచటి నేను?
ఎండనక కొండనక పుట్ట లేఱు లనక
నన్నుఁ జూడవచ్చితివె యనాథనాథ.

కునుకుందీపమునై మహాటవుల మిణుక్కుంబుర్వునై, పారముం
గనలే కీడ్గిలుపక్షినై తనువు చిక్కంబట్టి నీపాదమం
దణునై యంటుఁగఁ గోరి నిల్చితిని కాదా! భావనాతీత! ని
ర్గుణ! నీరూప! పరాత్పరా! శబరిఁ గన్గోవే దయాసాగరా!

అడుగులఁ జేతులఁ దాళము
లిడుచున్ నర్తించుచున్ మహీస్థలిఁ బడుచున్
జడతం గని యిట్టులు వెం
బడి లేచుచుఁ బూర్ణభక్తిఁ బడి యల్లాడెన్.

జారినకొప్పుఁ గట్టు దిగజారినచీరెయు మేనివెంబడిన్
జాఱెడిచెమ్మటల్ బుజము జారినపయ్యెద నేని భక్తివి
స్తారసుధాబ్ధి మున్గి కనఁ జాలకపోయినభక్తురాలియా
తీరు లెఱింగి లక్ష్మణుఁడు తేఁకువతో నొసఁగెన్ బ్రబోధమున్.

సీతలఁ పింగితమ్మును వినిర్మలభక్తి యెఱింగి రాముఁడే
యాతతవత్సలత్వహృదయమ్మున నీదరి చేరినాఁడు; నీ
ప్రీతిని గాంచినాఁడు; తెలివింగని యర్చలు దీర్చు మింకఁ ద
ద్రీతు లెఱుంగకుంటి శబరీ! యధరీకృతభక్తకిన్నరీ!

అతని కాతిథ్య మొసఁగి ధన్యాత్మ వగుము
మగువ! తమ్మని ప్రీతి లక్ష్మణుఁడు వలుక
తేరుకొని యాశబరి రాముదివ్యపాద
ములను గడిగెను జల్లనిజలము వోసి.

పాపాపనోదకర మగు
శ్రీపాదోదకము ద్రావి శిరమందునఁ దా
నేపారుభక్తిఁ దాల్చి
యాపై వనకుసుమవితతి నభ్యర్చించెన్.

ఒక్కకటాసనమందున
నొక్కెడఁ గూర్చుండఁ జేసియున్ దాఁచినయా
చక్కనిపండ్లను మిక్కిలి
మక్కువతోఁ దెచ్చి పూర్ణమతి నిట్లనియెన్.

ఏమేనోములు తొల్లి నోచితినో సామీ! నిన్ను సేవింపఁగా
కాయం బియ్యది ధన్య మయ్యె జనిదుఃఖం బంతరించెన్ మహా
మాయం దాటితిఁ జాలు నాకిఁక మహాత్మా రాఘవా! చీమగం
గాయా త్రియ్యైను నాదుజీవితము రాగద్వేషనిర్భగ్నమై.

జాతికి నీచురాల, గుణసంపద లేదు, శుచిత్వ మేమిలే
దాతతధర్మముం దెలియ నాప్తులు లేరు ధనంబు లేదు, ని
ష్ఠాతుక మైననీకృపకు నే నెటు పాత్రమ నైతి రామ! యే
రీతిగ నాతిథేయ మొనరింతును సామి! యెఱుంగఁ దెల్పవే.

ఫలమో మూలమొ కాయయో కసరొ యేపత్రమ్మొ పుష్పమ్మొ నా
పాలమం దున్నది తెచ్చి యిచ్చెదను దప్పుల్ పట్ట కోసామి! మీ
కలవాటైనది తెచ్చిపెట్టఁగలనయ్యా రామ! మన్నించి యీ
ఫలముల్ భక్తి నొసంగుదానఁ దిని యీపానీయముం ద్రావుమా.

ఇవె కొమ్మిపం డ్లిప్పుడిప్పుడే నేఁగోసి
పెట్టితి నీనోటఁ బెట్టవయ్య
ఇవె జామిపండు లియ్యవి నిన్న నే తెచ్చి
యుంచితి నీజిహ్వ నుంచవయ్య
ఇవె తియ్యమామిడు లింతకుమునె సేక
రించి దాఁచితి నోట నుంచవయ్య
ఇవె గొంజిపండు లెంతేని తీయనివి మ
చ్చునకైన వాచవి చూడవయ్య

రేఁగుపం డ్లిడిపండ్లు నే రేడుపండ్లు
పోకదొప్పల పోసి తివిగో
నడచి బీఱెండఁబడి వచ్చినాఁడ; వెంత
బడలియుందువో రామయ్య! పండ్లుతినుర.

అనుచు రామయ్యదోసిలియందు ఫలము
లునుప నాతఁడు కొని లక్ష్మణున కొసంగ
చిలుకకొఱికినవై యుండె నీఫలములెల్లఁ
దినుట యెట్లను చతఁడు సందేహపడియె.

తమ్ముఁడా! సందియ మ్మేల? తప్పదీమె
శుకమహర్షి యే; తన్ముఖశకలితములు
సత్ఫలమ్ము లియ్యవి; సుప్రసాదమధుర
మధురసాంచితములుఁ గ్రోల మాననేల?

అని యొక్కొక్కఫలంబు నోటనిడు, చాహా! యెంతమాధుర్య మిం దనుచున్ లొట్టలు వెట్టుచున్ నమలుచున్, అత్యాదృతిన్ దమ్మునిం దినుమం చింకొక టిమ్మటంచు శబరి న్వీక్షించుచున్ దేర్చుచున్ జనవుల్ చూపుచు రాముఁ డాదరమునన్ సాగించె నాతిథ్యమున్.

ఇట్టు లింకొక్క టిఁకనొక్క టింకనొకటి
తె మ్మటంచు శ్రీరాముఁ డందించికొనుచు
చొక్కి మూఁచూచి వాచవిచూచి యిడిన
శబరిఫలములు రామలక్ష్మణులు దినిరి.

వ. అంత నారామచంద్రుఁడు,

త్రికరణశుద్ధిగ నీవిడు
నకలంకఫలంబు లివ్వ డతిమధురములై
ప్రకటించె నీమహృదయం
బిఁక నీవాంఛితము తెల్పుమీ శబరి యనన్.

చిక్కియు శల్యమై పరమజీర్ణత నొంది నశింపనున్న యీ
బక్కను కోయదాని కొకభక్తియు ముక్తియుఁగాక కోర్కులా!
నక్కట నాకలోక మట నాబరితు కట్టిది; రామ! నీకు నే
పక్కఁగ దోఁచునో పతితపావన! నన్నటు లుద్ధరింపవే!

వ. అని యూరకుండినంత,

తమ్ముఁడ భక్తురాలిపటుతన్మయతం గనినావె? యీ మెచి
త్త మ్మది నిష్కలంకమెగదా? మనకోసమెగాదె యింతకా
ల మ్మిది నిల్చె;దీనిపరలక్ష్యము మోక్ష మనుగ్రహింతు; నన్
నమ్మినయెట్టివారినయినన్ గరుణించుట నాకు ధర్మమా.

అనియాడుచు సస్మితభా
షణుఁడై "శబరీ! మతంగసంయములతపో
వనభూమిఁ గల్గువింతలు
కనిపింపు" మటంచుఁ బల్కఁగా నది చూపెన్.

ఇచటనే మాగురు లెటెఁగి యోగాగ్నిచే
దేహదాహమును సంధించినారు
వణఁకుఁజేతుల శ్రమంపడి యీడనే వారు
త్రేతాగ్నులను వేల్వఁ దివురువారు
నీరాడి వా రిటనే వార్చి యార్ద్రవ
ల్కలము లీచెట్లకుఁ గట్టువారు
నిటుప్రాసములఁ బోనేరక పిలువఁగా
సప్తసాగరము లిచ్చటనె కలిసె.

ఇచటఁ దప మాచరించువా రిచటు సేరి
శిష్యతతికిఁ బ్రవచనము సేయువార
లిచట శయనించు వా రని యెంచి శబరి
దాశరథుల కాశ్రమపుణ్యతలులు సూపె.

అదె నీదాఁటినచిత్రకూటగిరి దివ్యన్నవ్యరత్నాకరం
బదిగో దవ్వున ఋశ్యమూకము తరువ్యాకీర్ణగండోపలం
బదె సుగ్రీవునవాసరోధనము సర్వాధారసజ్జీవనం
బిదె పంపాసర మీపరీసరము లెంతే మీసరంబుల్ ప్రభూ!

రామునిరాకలుం దెలియరాఁగ మతంగునిశిష్యులున్ మునుల్
తామయి వచ్చి యాశబరిధన్యతఁ గాంచి గురూక్తు లెంచి శ్రీ
రాము సలక్ష్మణుం గని పరాత్పరుగాఁ దలఁపోసి యాపరం
ధాముని కర్చనాదు లిడి తత్పరులై రొకకొంద ఱచ్చటన్.

ఇనకులరామచంద్రుఁడు మునీంద్రుల నందఱ గారవించి మీ
కనువగునే సమస్త మిట; హాయిగ నుందురె? యంతరాయముల్
పొనరవుగాదె? తావకతపోబలమే సకలప్రపంచర
క్షణచణ; మీరె లోకహితకాము లటంచు నమస్కరించినన్.

వ. మునులెల్ల రాతని స్తుతించుచు,

సారపుధర్మరక్షణము సత్యము శౌచము దీనరక్షయున్
భూరిప్రజానురంజన మపూర్వదయామతిఁ బూని పాలనం
బోరిమి నీ వొనర్పఁగ మహోదయ! క్షేమము గాక క్షామమే?
యేరికి రామరాజ్యము రహింపక యుండును స్వామి! పల్కవే.

లీలామానుషవిగ్రహుండ వయి జాలిం జెంది మాపైని నీ
లీలల్ చూపఁగ వచ్చియుండితివి నేఁడే కాదె? యీజన్మమం
దే లక్షించి నినుం దరించితిమి స్వామీ నేము; సద్భక్తి నీ
పాలం బడ్డమహాత్మురాలి శబరిన్ పాలించి లాలించితే.

కానంగఁజాలమైతిమి
యీనారీపరమభక్తి యిట్టి దటంచున్
ఏనాఁటివారమో? మా
కీనాఁటికి నేని శబరి కిడినటు లీవే.

వ. అని యనుచుండ నందుండి యొకముని లేచి,

దూషణభూషణాదులకు దుందుడు కందక, రామనామసం
భాషణ మెల్లవేళల జపమ్ముగఁ బూని, మహర్షి సేవలన్
తోషముతో నొనర్చి కడుదుర్లభ మైనసువర్గ మందఁగా
భూషిత యయ్యె నీశబరిపుణ్య మగణ్యముగాదె రాఘవా!

అనుమానించుచు నింద వెట్టుచును వ్యత్యాసమ్ముగాఁ బల్కి యే
వనితన్ మేమటు లాడిపోసితిమొ పాపం బంచు భావింప కా
వనితారత్నమునింటియందె డిగి తాత్పర్యంబుతో నామెయి
చ్చిన యాతిథ్యము కొంచు మానికులదుశ్చింతల్ తొలంగించితే?

వ. అనిన లక్ష్మణుండు,

ఈఁత నేర్చినవానికి లోఁతు లేదు
చిత్తశుద్ధిగఁ జేసినఁ జింత లేదు
పరజనవినిందకన్నఁ బాపంబు లేదు
దైవదృష్టికి నెంచ భేదమ్ము లేదు.

సాదులు పరోపకృతులతో సహాకరింప
మించి పుష్టించుచుండు ఫలించుచుండు
పూచి కాచురసాల మబ్బురము గొలుప
రాళ్ల రువ్వినన్ ఫలమును రాల్చుఁ గాదె;

సత్యముం బల్క నివ్వలిజగము లేదు
బూటకము వల్క నవల రాముండు లేఁడు
ఉత్తముని గర్వ మణఁగు సాధూక్తికలన
నీరమునఁ బాలపొంగు చల్లారినటులు.

అని భావగర్భితంబుగఁ
దొనఁకక రామానుజుండు తోడ్తోఁ బలుకన్
ముని యొకఁడు లేచి తా వం
దనపూర్వకముగ వచింపఁ దలకొనె నంతన్.

ఒకవిజ్ఞాపనమోయి దాశరథి! యేమోకాని స్నానాదిక
ర్మకలాపమ్ముల కొచు నచ్ఛమగుపంపానీర మొక్కుమ్మడిన్
వికలమ్మై చెడి శోణితాభమయి పర్వెన్, నిత్యనైమిత్తిక
ప్రకరం బడ్డఁ దొలంచి దీనిఁ గరుణాపారీణ! కాపాడవే!

ఎన్నో ప్రక్రియ లాచరించితిమికానీ స్వామి! పానీయ మే
తెన్నన్ స్వచ్ఛము గాదు; కారణము గుర్తింపంగలేమైతి, మా
పన్నత్రాణపరాయణా! మునులయిబ్బందిం దొలంగించి సం
పన్నంబౌనటు చేసిపెట్టుమి మహాత్మా! మానికల్పద్రుమా!

మౌనివాక్కులు వినుచు లక్ష్మణుఁడు సన్మి
తాననుం డౌచు మునులు మహానుభావ
సత్వసంపన్నమూర్తులు; సాధుశీలు
రకట! తమ కయ్యె నిది యేటియవగడంబొ?

అంతశ్శక్తిని జేతబట్టియు నిరీహన్ తత్త్వసంధానులై
శాంతిన్ దాంతిని బూని సర్వసములై సత్యవ్రతాలంబులై
కాంతారంబుల సత్తపోవ్రతపరాక్రాంతిం బ్రవర్తిల్లుమీ
రెంతే ధన్యులు; మీబలమ్ము కోసకాదే నిల్చు లోకమ్ములున్.

'ఐతే నొక్కటి, మౌనిమండలములో నగ్రేసరుల్ ధన్యులా
మాతంగుల్ పరతత్త్వమూర్తు లని సంభావింతుమే కాదె; త
చ్చేతఃప్రీతి ననుగ్రహంబు నిటఁ గాంచెన్ మించె సద్భక్తి నే
రీతిం జూచిన ధన్య యీశబరి; మీరే లోన భావింపుఁడీ.

అట్టిభక్తురాలి ననరాని వినరాని
భాషణముల బాధపఱచి రెవరొ?
ఉడికె నేని యుత్తమోత్తమహృదయంబు
దైవశక్తి యైన దద్దరిలదె?

పొరపొచ్చెంబులు లేనియీశబరి-చొప్పుం దప్పుగాఁ బట్టి ద
బ్బఱలం బల్కుట భక్తనింద యొడమెన్ భావింపుఁ డామీఁద స
ద్గురు మాతంగుని నింద వెట్టుట గురుద్రోహంబు మీకబ్బె నీ
వసుసన్ కోపులు పాపులున్ మునుఁగఁ బంపం బుట్టవే ఘోరముల్.

పూవుల్ చెట్టునఁ బుట్టి సద్వికసనంబుం బొందు నెచ్చోటనో
తావుల్ కేఁగిన దూరదూరముగ వ్యాప్తం బౌను; తద్రీతిగన్
మీవా రొక్కరు కర్మమున్ సలుప సామీ! యద్ది మిమ్మందఱన్
దీవల్ చుట్టినరీతిఁ జుట్టుకొనె; సందేహంబు లే దిందునన్.

కాన మాతంగశిష్యుల గౌరవించి
తప్పు మన్నింపఁ గోరుట తప్ప దిపుడు
భక్తశబరి స్పృశింపఁ బంపాజలమ్ము
తక్షణమె బాగుపడుట తథ్యమ్ము వినుఁడు.

నివురు గప్పినబొగ్గుని ప్పెఱుంగక తొక్క
    కాలుఁగా కది మానఁగలుగు నెట్టు?
కలకండ మనుకొని గరళమ్ము మెసవిన
    నసువు లూడ్పక విడనాడు నెట్టు?
చొఱవమై నల్లత్రాచును కాన కే తొక్కఁ
    గఱచి చంపునుగాక తిరుగు నెట్టు?
పసికూన తెలియకే పడినచో నీటను
    ముంచి చంపక మానఁబోలు నెట్టు?

మౌనివరులార! దీనిసంబంధ మిద్ది
కర్మపద్ధతి తా మెఱుంగనిది కాదు.
చేతితోఁ దెచ్చికొన్న యిప్పాతకంబు
కట్టికుడుపక పో దెట్టికర్మఠునకు.

పరితోవ్యాప్తమహర్షిమండలముతో భాషింప నాలక్ష్మణుం
డురుభీతిన్ దమతప్పులం దెలిసి యం దున్నట్టిమానిబ్రువుల్
పిలుకుల్ నల్వురు లేచి కంపిలుచు బెంబేల్వోయి కేల్మోడ్చి ని
ల్చిరి శీర్షంబులు వంచి; దేవు నెటు వంచింపంగనౌ నెయ్యెడన్.

వ. అప్పు డామున్యాభాసులు,

ముప్పుల్ రాఁగలవంచు నెంచక మహామూర్ఖత్వముం జూపి యీ
తప్పుల్ చేసితిమయ్య; వచ్చె నిటు నిందల్; మమ్ము మన్నించి మా
తిప్పల్ తీఱిచి యీసభన్ దలల నెత్తింపంగదే రామ! నీ
యప్పుం దీర్ప క్షమార్పణంబు శబరీ! యంచుం బదం బంటినన్.

భక్తురాలిపదపద్మ మంటుడున్
ముక్తులైరి మునిముఖ్యులయ్యెడన్
రక్తులౌచు రఘురాము నుతింపన్
శక్తులై రసయశం బటు వాసెన్.

శబరియు మ్రొక్కుచున్న మునిచంద్రులఁ గాంచి యిదే మిదేమయా
అబలను నీచురాలను మహాత్ములకున్ నతు లంచుఁ బల్కుచున్
గుబులున లేవఁబోవ మునికుంజరులెల్ల వినమ్రులౌచు నా
శబరిని రామలక్ష్మణులఁ జక్కఁగఁ జుట్టిరి భక్తి చిప్పిలన్.

తెట్టులుగట్టి పుర్వు లటు తెప్పునఁ దేలఁగ నెఱ్ఱవాఱి యు
స్నట్టెజలమ్ముతోఁ గలుషమై యతిదుస్సహపూతిగంధసం
ఘట్టితభంగమై దురవగాహమునై చెడియున్న పంపకున్
గుట్టలుగా మునుల్ శబరిఁ గూడియు దాశరథుల్ క్రమంబునన్.

తత్తీరంబును జేరఁగ
నుత్తలపడి రామచంద్రుఁ డోశబరీ మా
చిత్తము రంజిల దిగి జల
మెత్తుము నీరములు గ్రోల నే వాంఛింతున్.

అనుచుఁ గేలూఁత యొసఁగి రామయ్యతండ్రి
శబరితో పాటు దిగె ననుజన్ముఁ గూడి
పంప యుప్పొంగి సంగతభంగ యగుచు
విమలయై వారిపాదపద్మములు గడిగె.

తీరారగ్వధసింధువారముల భక్తిన్ రాల్చి వ్యాకోచక
ల్హారాంభోజకుశేశయప్రతతి నత్యంతాప్తిఁ బూజించి శృం
గారం బొప్ప తరంగశీకరము లొల్కం జల్లి శీతానిలాం
కూరమ్ముల్ పచరించి వారలకుఁ జేకూర్చెన్ మహానందమున్.

బుగబుగఁ గమ్మతావులు గుబుల్కొనఁగా మునులెల్ల రానదిన్
దిగి జలకంబు లాడి వినుతించుచు రాముని, భక్తురాలినిన్
దగువిధి నర్చనాదులను దన్పిరి; మౌనులు పూర్ణకాములై
నెగడిరి; రాముఁ డాశబరినిం గని మోక్షదుఁ డౌచు నిట్లనున్.

కామక్రోధములం ద్యజించియును జిక్కంబెట్టి దేహంబు నీ
నేమం బేమఱకే త్రిశుద్ధిగను నన్నే నమ్మి, యెన్నెన్ని యో
బాముల్ పొందియు భక్తియోగపరతాత్పర్యంబు సంధించి యీ
రామున్ నీదరి కీక్షించుకొంటి విఁకఁ గోరంగల్గు నేయర్థముల్?

కోరుట కేమున్నది క
న్నారన్ నిను గాంచుచుండ హర్షమ్మున; సం
సారము వాపుచు నీలోఁ
జేరిచికొను టొకటి తక్క శ్రీరఘురామా!

వ. అన విని రాముండు,

ఆచంద్రార్కము నీచరిత్రము మహాహ్లాదంబుఁ గల్పించుచున్
భూచక్రిమ్మున నిల్వ జీవనదివై పూతాత్మవై గౌతమీ
సాచివ్యంబున సాగుచుండు మిది నాసంకల్ప; మీరూపునన్
వాచాతీతము నీదుజీవనము, విశ్వశ్రేయమ్ముం గూర్చుతన్.

ఇదిగో మోక్షము గొను మి
చ్చెద నని రఘురాముఁ డామెశీర్షమునఁ గరం
బదుమఁగ శబరీహంసము
ముదమునఁ గైలాసవాసముం గనె నంతన్.

దండకావాసులెల్లఁ దద్దర్శనమున
నబ్బురంపడి నిల్చి రయ్యవసరమున
అర్కకులజులు శబరి దేహంబునకును
దాహ మిడి పారలౌకికతతి నెఱపిరి.

ఎక్కడిదానవే శబరి! యింతకు నెంతగఁ బెట్టిపుట్టితే
యెక్కడినీకులంబు గుణ మెక్కడి దెక్కడినీదుజన్మ మీ
ఫక్కిని భక్తియోగమును బట్టి తరించితి; మోక్షలక్ష్మి చేఁ
జిక్కెను నీకు, దాశరథిచే జలదాన; మదెంతపుణ్యమో?

నెలవులు సేరి రాశబరినిన్ రఘురాము సలక్ష్మణున్ మనం
బులఁ గొనియాడుచున్ మును; లపూర్వపుఁదత్కథ వాడవాడలన్
నెలసెను వేయునోళ్లఁ గడువింతలు వింతలుగాఁగ; వారు ధ
న్యులు సమకాలికుల్; కనఁగ నోచిరి శ్రీహరి దండకాటవిన్.

భక్తియుఁ బరతత్త్వముపై
సక్తియు జన్మాంతరప్రసక్తం బగుడున్
యుక్తములగు జీవుల కీ
శక్తిని జేపట్ట నిఁక నసాధ్యము కలదే!

మోక్షం బిటు శబరికి నిడి
సాక్షాత్పరమేశ్వరుండు సనె సానుజుఁడై
దీక్షాదక్షుల మానుల
రక్షాబంధనము రామురాకలు నయ్యెన్.

కల్యాణమూర్తి లగునీ
కల్యాణాత్మకుల కెల్లకాలమును జగ
త్కల్యాణకరుఁడు శాశ్వత
కల్యాణుఁ డొసంగు నిత్యకల్యాణములన్.

పుస్తకములకొఱకు


దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

సీనియర్ తెలుగు పండితుఁడు

M. S. N. C. M. P. స్కూలు

జగన్నాయకపురము

కాకినాడ.